కూలే బ్రిడ్జికి హంగులు

- రూ.20లక్షల ఖర్చుతో మెరుగులు
- ప్రమాదపుటంచున రెయిలింగ్, మెట్లు
- స్లాబ్ కింద తేలిన ఇనుప చువ్వలు


విరిగిన రెయిలింగ్‌తో పొంచిఉన్న ప్రమాదం


బ్రిడ్జికి ఇరువైపులా పెరుగుతున్న మొక్కలు


కూలిపోయిన మెట్లు

జనగామ: మెట్లు కూలిపోయి.. రెయిలింగ్‌కు పగుళ్లుపట్టి.. ఫుట్‌పాత్ లేక.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని జనగామ పట్టణంలోని 'వారధి'కి హంగుల పేరిట లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. పురపాలిక అధికారులు వార్డుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పట్టించుకోకుండా అవసరంలేని వాటికోసం పాకులాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు రాష్ట్రాల ను అనుసంధానం చేస్తూ నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో కాలంచెల్లి శిథిలమైపోతున్న జనగామ ఫ్లై ఓవర్ నిర్వహణను గాలికొదిలేశారు.

ఫ్లై ఓవర్ చుట్టూ మొక్కలే..

పట్టణంలోని ఫ్లై ఓవర్ రెయిలింగ్ రెండు వైపులా మొక్కలు పెరుగుతుండడంతో ప్రమాద సంకేతాలు కళ్లకు కనిపిస్తున్నాయి. రావి చెట్ల వేర్లు బ్రిడ్జి లోపలకు చొచ్చుకుపోతున్నాయి. ఫ్లై ఓవర్‌పై రెండు వైపులా ఫుట్‌పాత్ రోడ్డుకు సమానంగా కావడంతో వేగంతో పాటు నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా వాహనాలు కిందకు పరుగులు పెట్టే అవకాశం లేకపోలేదు.

బ్రిడ్జి కాలం చెల్లిందా..?

రోడ్డు సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా ఫ్లై ఓవర్‌పై భారీ వాహనాలు వెళ్తున్నాయి. ఓ పక్క బ్రిడ్జిపై హరితహారాన్ని తలపించే విధంగా మొక్కలు వృక్షాలుగా మారిపోతూ.. అనేకచోట్ల పగుళ్ల పడుతున్నాయి. బ్రిడ్జి మధ్య నుంచి కాలినడకన కిందకు దిగే మెట్లు.. రెయిలింగ్ పూర్తిగా కూలిపోయాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఏడేళ్ల క్రితమే బ్రిడ్జి ప్రమాదంలో ఉందని ఇంజనీరింగ్‌శాఖకు చెందిన ఉన్నతాధికారులు హెచ్చరించినట్లు సమాచారం.


బ్రిడ్జిపై మునిగిన ఫుట్‌పాత్

సత్తువ లేని వంతెనకు హంగులు..

ఫ్లై ఓవర్ శిథిలమైన సమయంలో మున్సిపల్ శాఖ లక్షల ప్రజాధనం ఖర్చు చేస్తూ పైపై మెరుగులు దిద్దే ప్రయత్నం చేస్తోంది. బ్రిడ్జిపై కాలినడకన వెళ్లే వారి కోసం ఫుట్‌పాత్ ఏర్పాటుచేస్తే.. దానిపై సుమారు రూ.5లక్షల వ్యయంతో కుండీలు ఏర్పాటు చేశారు. ఫ్లడ్ లైట్లకు రంగురంగుల బల్బు బిగించారు. బ్రిడ్జి కింద భాగంలో గ్రీనరీ పెంచేందుకు దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. పట్టణంలోని అనేక వార్డుల్లో దీర్ఘకాలికంగా అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉంచి.. అవసరం లేని చోట ప్రజాధనం వృథా చేస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. జనరల్ ఫండ్‌తో పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాల్సిన అధికారులు అవసరం లేని చోటల్లా అభివృద్ధి పేరిట నిధులను నీళ్లలా ఖర్చుచేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


శిథిలమవుతున్న బ్రిడ్జికి మెరుగులు

ఆందోళనకరమే..



జనగామ బ్రిడ్జి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి చాలా ఏళ్లు గడిచిపోతోంది. ఇంజనీరింగ్ నిపుణులు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి అవసరమైతే మరమ్మతులు చేపట్టాలి. పట్టణంలోని అనేక వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా, శిథిలమైన బ్రిడ్జికి హంగులు దిద్దడం ఏంటో అర్థం కావడం లేదు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మేలుకుంటే మంచిది.

\- రామిని హరీశ్, టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్

కూలిపోతుంటే లక్షలు ఖర్చు చేస్తారా..



ఫ్లై ఓవర్, మెట్లు కూలిపోయి.. ఫుల్‌పాత్ కుంగిపోతుంటే లక్షల రూపాయ ప్రజాధనం ఖర్చు చేయడం సిగ్గుచేటు. వంతెన ఫుట్‌పాత్‌పై కుండీలను దేశంలో ఎక్కడా చూడలేదు. పాదచారులు ఎలా వెళ్లాలి. కూలిపోయిన మెట్ల మీదుగా నడుస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు స్పందించాలి.

\- గాదెపాక రాంచందర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్

దుర్గామాత ఆలయానికి రూ.2లక్షల విరాళం


రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న సర్పంచ్ బక్క యాదగిరి

రఘునాథపల్లి: గ్రామాభివృద్ధే లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మండలంలోని రామరాయిబంగ్లా సర్పంచ్ బక్క యాదగిరి గురువారం దుర్గామాత ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేసి దాతృత్వం చాటుకున్నాడు. ఇప్పటికే గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహనసంస్కారాలకు రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఉపసర్పంచ్ మడికంటి మమతసుధీర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సాదం కుమారస్వామి, వార్డు సభ్యులు మేరుగు కరుణాకర్, బక్క ఆంజనేయులు, గందం సత్యనారాయణ, కీర్తి శ్రీనివాస్, బక్క మల్లేష్, మద్దెల యాదగిరి, మేరుగు వెంకటేష్, పెద్ద కుమారస్వామి, తోట కనకరాజు, కొమురయ్య, రాజు, మడుపు కరుణాకర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కళింగరాజు

జనగామ రూరల్: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలు సమస్యలపై చర్చించారు. ఓబుల్‌కేశాపూర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని.. అలాగే ఆన్ ఆఫ్ చేయకపోవడం వల్ల అధిక బిల్లులు వస్తున్నాయని సర్పంచ్ రేణుక తెలిపారు. పెద్ద తండా(ఎం)లో మిషన్ భగీరథ నీరు రావడంలేదని, వాటర్ ట్యాంక్ ఎత్తులో ఉండడం వల్ల సమస్య ఏర్పడుతుందని సర్పంచ్ లచ్చిరాం సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. సమష్టికృషితోనే ప్రగతి సాధ్యం అని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా అభివృద్ధి సాధించాలన్నారు. జనగామ మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హసీం, ఎంపీఓ సంపత్‌కుమార్, వివిధ శాఖ అధికారులు, సర్పంచ్‌లు ,ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

జీసస్ మార్గదర్శకాలు ఆచరణీయం


విద్యార్థుల పాదాలు కడుగుతున్న జాన్ ఫ్రాన్సస్

దేవరుప్పుల: ప్రపంచ శాంతి కోసం జీసస్ మార్గదర్శకాలు ఆచరణీయమని ఫాదర్ జాన్ ఫ్రాన్సిస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ముందస్తు గురువారం 12 మంది విద్యార్థుల పాదాలను ఆయనతోపాటు బ్రదర్ జేసురాజు కడిగి పునీతం చేసుకున్నారు. నాడు యేసు తన శిష్యుల పాదాలు కడిగి పరిశుద్ధ ధర్మాన్ని ఆచరించినట్లు మతగురువులు సైతం భక్తులతో సమానమనే సంకేతానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా యేసు మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


లింగాలఘణపురం: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

బచ్చన్నపేట/జఫర్‌గఢ్/నర్మెట/దేవరుప్పుల/లింగాలఘణపురం/తరిగొప్పుల/రఘునాథపల్లి/పాలకుర్తిటౌన్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు పాటుపడాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నర్మెటలో..


పాలకుర్తి టౌన్: జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌గౌడ్

తాలుపోయిన వరి.. ఆందోళనలో అన్నదాతలు


వరిని పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓ

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లి, కుందారం గ్రామాల్లో ఆర్‌కే కేఎస్‌ఎం118, సోనామ్ జెజీఎల్-24423 రకం వరి గింజలు గట్టిపడకుండా 80 శాతం తాలుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుమ్మడవెల్లికి చెందిన సంగి వెంకటేష్ మన గ్రోమోర్‌లో ఆర్‌కే కేఎస్‌ఎం రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి మూడున్నర ఎకరాలు, దడిగ గట్టయ్య జనగామలోనే మరో విత్తన షాపులో నాలుగు ఎకరాలు ఇదే రకం వరి విత్తనాలు తీసుకొచ్చి నారు పోసి నాట్లు వేశారు. వరి ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందనే ఆశతో ఉండగా గింజలు గట్టిపడకుండా తాలుపోయింది. 80 శాతం గింజలు తాలుపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. గురువారం ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ స్పందన వరిని పరిశీలించారు. కేఎస్‌ఎం రకం అగ్గి తెగులును తట్టుకోక మెడ విరుపు తెగులుగా మారి గింజ గట్టిపడకుండా తాలుపోయి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా జఫర్‌గడ్ మండలానికి చెందిన రడపాక రాజ్‌కుమార్‌ను నియమించినట్లు టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజ్‌కుమార్ ఘన్‌పూర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సహకరించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ సతీష్‌తో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: పెరిక సంఘం మండల నూతన అధ్యక్షుడిగా మంచాల వెంకటయ్య ఎన్నికయ్యారు. గురువారం మండలకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నూతన కమిటీని ఎనుకున్నారు. ఉపాధ్యక్షులుగా దాచిపల్లి మల్లేషం, లెంకట సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సందెల బాలసిద్దులు, కోశాధికారిగా మల్యాల అనిల్‌కుమార్, ప్రధాన సలహాదారులుగా మల్యాల హరినాథ్, సందెల వెంకటేష్, రాజయ్య, సుబ్బురు శ్రీనివాస్, దాచేపల్లి పెద్ద అశోక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, నాగేష్, మల్లేశ్వర్, హరినాథం, లక్కార్స్ వెంకటేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దాచేపల్లి నరసింహారావు, లంకెల కరుణాకర్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పూజలు

బచ్చన్నపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల ఆంజనేయ స్వామి ఆలయాల్లో జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వెళ్లి పూజలు చేశారు. హనుమాన్ మాలాధారులు విరమణకు వెళ్లగా, నూతనంగా కొందరు స్వాములు మాలాధారణ చేశారు. అలాగే నర్మెటలో భక్తులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ పహారా



రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ, రఘునాథపల్లి, వెల్ది పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద గురువారం పోలీసులు పహారా కాశారు. పరీక్ష పేపర్ల లీకేజీ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై ఎస్.వీరేందర్ పరీక్ష కేంద్రాల చుట్టూ బందో బస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలకు ఎవరిని రానీయకుండా పర్యవేక్షించారు. జిరాక్స్ సెంటర్లను పూర్తిగా బంద్ చేయించారు. పరీక్షలు ముగిసే వరకు 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేశారు.

పరీక్షలకు ఇబ్బంది కలిగించొద్దు



చిల్పూరు: పదో తరగతి విద్యార్థులను ప్రశాంతంగా పరీక్షలు రాయనీయాలని, ఎవరైనా సరే పరీక్ష కేంద్రం చుట్టుపక్కల కనిపిస్తే చర్యలు తప్పవని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రం వద్ద ఎస్సైతో పాటు ఏఎస్సై జయకుమార్‌తో బందోబస్తు నిర్వహించారు.

క్యాన్సర్‌తో బాలుడి మృతి



కొడకండ్ల: మండలంలోని గుమ్ములబండతండా గ్రామ పంచాయతీ శివారులోని నల్లెలగడ్డ తండాకు చెందిన మాలోత్ సంతోష్(10) క్యాన్సర్ వ్యాధితో బుధవారం రాత్రి మృతి చెందాడు. మాలోత్ సంతు-కమలమ్మల రెండో కుమారుడైన సంతోష్‌కు గత రెండేళ్ల కిందట బ్లడ్ క్యాన్సర్ సోకగా కుమారుడిని కాపాడుకొనేందుకు తల్లిదండ్రులు వైద్యం కోసం లక్షల రుపాయాలు ఖర్చు చేశారు. ఆస్పత్రుల చుట్టు తిరిగి ఎంత ఖర్చు చేసినా కుమారుడు దక్కకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నిధులు మంజూరు చేయండి

రఘునాథ పల్లి: మండలంలోని లక్ష్మీ తండా నుంచి ఫతేషాపూర్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. గురువారం లక్ష్మీతండా సర్పంచ్ పయ్యావుల లావణ్య కుమార్, ఫతేషాపూర్ మాజీ సర్పంచ్ గాజులపాటి మహేందర్ ఆధ్వర్యంలో హనుమకొండలో శ్రీహరిని కలిసి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఉప సర్పంచ్ రవి, మోహన్ రావు, పయ్యావుల రవి, నర్సింహులు, మదారు ఉన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, ప్రజలు


హనుమన్ భజన చేస్తున్న భక్తులు

జనగామ రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులు శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల మీదుగా జనగామ చౌరస్తా వరకు శోభాయాత్ర కొనసాగింది. దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు ప్రదర్శన ఇచ్చారు. అలాగే నర్మెటలో భక్తులు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.


నర్మెట: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బండి సంజయ్ అరెస్టు రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న మాదాసు వెంకటేష్

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని, పోలీసు వ్యవస్థ కల్వకుంట్ల కుటుంబానికి బానిసల్లా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాదాసు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలో దేశాన్ని విశ్వగురువుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గట్టు క్రిష్ణ, నాయకులు బూర్ల విష్ణు, తాళ్లపెల్లి శ్రీనివాస్, కొలనుపాక శరత్‌కుమార్, డాక్టర్ వంగ వేణు, ఆరోగ్యం, చింతపండు నాగేందర్, సూర్యతేజ, ఉపేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

13న సర్వసభ్య సమావేశం

దేవరుప్పుల : ఈ నెల 13 న మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్. రవీందర్ తెలిపారు. విధిగా మండల, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల, అనుబంధ శాఖల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలన్నారు.

ఉపాధి హామీ పథకంతో బహుళ ప్రయోజనాలు


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సావిత్రి, సర్పంచ్ రమేష్

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్ అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపురం తెట్టకుంట నుంచి పెద్దమడూరు శివారు వరకూ ఉపాధి హామీ కింద మంజూరైన రూ.7 లక్షలతో తలపెట్టిన రోడ్డు పనులను ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి పనులు చేయడం వల్ల కూలీలకు జీవనోపాధితోపాటు తద్వారా గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యే సదవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి క్రమంలో కూలీలు వేసవి తాకిడికి గురికాకుండా తగు జాగ్రత్తలతో ఎక్కువ మంది పనులు చేపట్టి అభివృద్ధికి దోహదపడాలని కోరారు. సర్పంచ్‌చ రెడ్డిరాజుల రమేష్, వార్డు సభ్యురాలు రుద్రోజు నిర్మల , టెక్నికల్ అసిస్టెంటు యాదగిరి, ఫీల్డు అసిస్టెంటు శ్రీను, బండారి యాదయ్య, మురాల కిష్టయ్య, దుదాటీ మైస్సారావు, పెద్ది శ్రీను పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

'శ్రీరామకృష్ణ'లో ఓపెన్‌హౌస్

బచ్చన్నపేట: తల్లిదండ్రులు పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం పాటుపడాలని మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయం ప్రిన్సిపాల్ నిమ్మరాంరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కరికె ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల తల్లిదండ్రులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల అభిరుచుల మేరకు వారి చదువుల దిశా, నిర్దేశాలను నిర్ణయించాలని అన్నారు.

టూరిజం చైర్మన్‌కు అభినందనలు

రఘునాథపల్లి: నూతనంగా రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు వారాల రమేష్‌యాదవ్ గురువారం మ ర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో గెల్లు శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మండలంలోని ఖిలాషాపూర్ సర్వాయి పాపన్న కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యమకారులకు బీఆర్ఎస్‌లో గుర్తింపు లభిస్తుందని రమేష్‌యాదవ్ పేర్కొన్నారు.

నిర్దేశిత ప్రమాణాల్లో పనులు చేయాలి



కొడకండ్ల: సమయపాలన పాటిస్తూ నిర్దేశిత ప్రమాణాల్లో కూలీలు ఉపాధి పనులు చేయాలని ఏపీఓ నరిగే కుమారస్వామి సూచించారు. గురువారం రామేశ్వరం, రామవరం గ్రామాల్లో ఉపాధి పనులు, నర్సరీలను ఆయన పరిశీలించి మస్టర్ తనిఖీ చేసి కూలీలకు అవగాహన కల్పించారు. నర్సరీల్లో మొక్కలకు సక్రమంగా నీరందిస్తూ చనిపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ సూచించారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈ నెల 8న హిమ్మత్‌నగర్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సభా స్థలాన్ని గురువారం పార్టీ బృందంతో కలిసి పరిశీలించారు.

రణదివెకు ఘన నివాళి


రణదివె చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పాలకుర్తి: భారత కార్మిక ఉద్యమ కెరటం బీటీ రణదివె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల సోమన్న అన్నారు. గురువారం పాలకుర్తిలో రణదివె వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ రణదివె కార్మిక, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన మహనియుడని కొనియాడారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంబటి సోమయ్య, రమేష్, గుంశ, సమ్మయ్య, ఎల్లయ్య, కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న కడియం

జఫర్‌గఢ్: తిడుగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నల్లతీగల భాష తండ్రి యాకయ్య మృతి చెందాడు. కాగా, విషయం తలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలిసి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తీగారంలో అనారోగ్యంతో మృతి చెందిన సొంటిరెడ్డి వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని కడియం శ్రీహరి సందర్శించి నివాళులర్పించారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మోహన్‌రావు, రాజేష్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., L.L.B.,
Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist: Jangaon, Cell: 9848430926